క్లుప్తంగా

రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

చీరాల రూరల్: రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం పొలం పిలుస్తుంది పోస్టర్లను ఎమ్మెల్యే కొండయ్య చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల సమష్టి సమన్వయంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషిచేస్తోందని చెప్పారు. వారంలో ప్రతి మంగళ, బుధ వారాల్లో ఒక్కో రోజు రెండు గ్రామాల్లో, వారానికి నాలుగు గ్రామాల్లో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించి రైతుల సంక్షేమం కోసం పాటుపడతారని చెప్పారు.

పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుడు యర్రాకోటి స్వాములు వారి కుమారుడు గోపాల కృష్ణ సాయం అందజేశారు. సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. పాఠశాలకు సంవత్సరానికి సరిపడ మినరల్ వాటర్ అందజేసేందుకు నిధులు అందజేశారు. అలాగే అవసరమైన ఆట వస్తువులు సమకూర్చనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో–2 బీ సుధాకరరావు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మల్లవరపు ఆదిలక్ష్మి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్రిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



బద్రిరెడ్డిని సన్మానిస్తున్న విద్యాకమిటీ సభ్యులు

వేటపాలెం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న భవనం బద్రిరెడ్డిని సహ ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఉప విద్యాశాఖధికారి అబ్బరాజు శ్రీనివాసరావు సూచించారు. అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం భవనం భద్రిరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా స్కూల్ విద్యా కమిటీ హెచ్ఎంను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎంగా పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగా పాల్గొంటున్నారని అభినందించారు. అనంతరం హెచ్ఎం బద్రిరెడ్డి దంపతులను ఘనంగా దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జేవి సుబ్బయ్య, బ్రహ్మారెడ్డి, గుమ్మా శ్రీనివాసరావు, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి లక్ష్యాలే భవిష్యత్‌కు పునాది



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ముందుగా తమ లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని అప్పుడే విద్యార్థులు చదువులో బాగా రాణిస్తారని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ అన్నారు. నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత చదువులపై కేరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్‌చంద్ర, వక్త పిన్నిక సాంబశివరావులు విద్యార్థులకు భవిష్యత్ చదువులపై అవగాహన కల్పించారు. నిరంతరం కృషి చేస్తే లక్ష్యసాధన కష్టమేమీ కాదని నిపుణులు సూచించారు. అనంతరం వక్తలను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వరాణి, క్లబ్ సభ్యులు పోలిశెట్టి చంద్రశేఖర్, పాబోలు వెంకన్న, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ: మండలంలోని వేమవరం గ్రామంలో అక్రమ మద్యం బాటిళ్లను నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వివరాల మేరకు.. వేమవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తన సిబ్బందితో ఎస్సై తనిఖీలు నిర్వహించగా కాలనీకి చెందిన మూఢవత్ పెద్ద సీతానాయక్ మోటార్ బైకులో అక్రమంగా 7 మద్యం సీసాలు తీసుకెళ్తున్నాడు. సీసాలను స్వాధీనం చేసుకుని సీతానాయక్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

శనగ సాగుకు వేళాయే

- రబీలో ఏడు వేల ఎకరాల్లో శనగసాగుకు అవకాశం
- ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు
- వ్యవసాయాధికారి సలహాలు, సూచనలు



మేదరమెట్ల: ఈ ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్‌లో పంటలు అంతంత మాత్రంగానే సాగు చేశారు. అరకొరగా సాగు చేసిన పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వలన వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఖరీఫ్ కాలం పూర్తిగా రైతులకు నిరాశే మిగిల్చింది. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా చేసుకున్న రైతులు రబీలో శనగసాగు చేపట్టేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. గతేడాది 9 వేల ఎకరాల్లో సాగు చేపట్టిన శనగ పంటను ఈ ఏడాది ఏడు వేల ఎకరాలల్లో మాత్రమే సాగుచేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నట్లు వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు చెప్పున్నారు. శనగ సాగులో ప్రకృతి సాగు పద్ధతుల్లో చేసుకోవడం వలన రైతులకు వ్యసాయ ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వచ్చేందుకు వీలుంటుందని, రబీలో శనగపంటను సాగుచేసేందుకు అక్టోబర్, నవంబర్ మాసాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయాధికారి అంటున్నారు.

నేలలు..
సారవంతమైన నల్లరేగడి నేలలు శనగ పంటకు అనుకూలం. నల్లరేగడి నేలల్లో ఉండే తేమను తీసుకొని శనగ పంట పండేందుకు వీలుంటుంది. శీతాకాలంలో మంచు వలన వచ్చే తేమతో మొక్కలు పెరుగుతాయి కనుక ఈఏడాది శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

విత్తన రకాలు..
జేజీ–11, 49, ఎన్‌బీజీ–47, జాకీ 9218, కాక్–2 రకాలు, నంద్యాల శనగ రకం 458, విహారి 95311 రకాలు మన నేలలకు అనుకూలం.

విత్తనం–విత్తేపద్ధతి..
ఎకరాలకు 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం అవుతుంది. రైజోబీయం విత్తనానికి పట్టించి విత్తుకుంటే పంట దిగుబడిలో 30 శాతం అధికంగా పొందవచ్చు. అలాగే బీజామృతంతో విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలి. 30×10 సెంటీ మీటర్లు వరుసల మధ్య, మొక్కల మధ్య దూరం ఉండేలా విత్తుకోవాలి.

సేంద్రియ ఎరువులు..
చివరి దుక్కిలో 4 ట్రక్కుల పశువుల ఎరువును వంద కిలోల ఘనజీవామృతాన్ని పొలంలో వేసి కలియదున్నాలి. ఎకరాకు ఒకటి లేదా రెండు క్వింటాళ్ల వేపపిండి వేసుకోవాలి. పూత ఎక్కువగా వచ్చేందుకు అధిక దిగుబడి కోసం ద్రవజీవామృతాన్ని 15 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా పంటపై పిచికారీ చేసుకోవాలి.

అంతర కృషి..
పంటలో నెలరోజుల వరకు ఎలాంటి కలుపు ఉండకుండా చూసుకోవాలి. శనగ చుట్టూ జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలను మూడు వరుసలుగా రక్షక పంటలుగా వేసుకోవాలి. శనగలో ధనియాలను అంతర పంటగా సాగు చేపట్టవచ్చు.

సస్యరక్షణ..
శనగపంటను ఆశించే అధిక నష్టం చేసే పురుగులలో ప్రధానమైనవి అతి ప్రమాదకరమైనది శనగపచ్చ పురుగులు, లద్దెపురుగులుగా చెప్పుకోవచ్చు. వీటి నివారణకు శనగపంటలో ఎకరాకు 100 మొక్కల వరకు బంతి మొక్కలను వేసుకోవాలి. పశువుల పేడ, మూత్ర ద్రావణం కలుపుకొని ప్రతి 15 రోజుల కొకసారి పంటపై పిచికారీ చేసుకోవాలి. నీమాస్త్రం లేదా వేపకషాయాన్ని పంటపై పిచికారీ చేస్తే రెక్కల పురుగులు మొక్కల ఆకులపై గుడ్లు పెట్టకుండా ఉంటాయి. ఎకరాకు 10 వరకు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవడం వలన పంటలో పురుగుల ఉధృతిని తెలుసుకోవడానికి తద్వారా వాటి నివారణ చర్యలకు దోహదపడుతుంది. పురుగులను తినే పక్షి స్థావరాలను పది వరకు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు ఉధృతిని బట్టి 5 శాతం వేపకషాయాన్ని పంటపై పిచికారీ చేసుకోవాలి. పురుగుల ఉధృతి అధికంగా ఉంటే పచ్చిమిర్చి, వెల్లుల్లి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. పంటపై ద్రవ జీవామృతాన్ని పిచికారీ చేసుకోవడం వలన మంచి ఫలితాలు వచ్చేందుకు వీలుకలుగుతుంది.

తెగుళ్లు–నివారణ చర్యలు..
ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు శనగ పంటలో ఎక్కువగా కనిపిస్తాయి. వీటి నివారణకు కిలో విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మావిరిడిని విత్తనానికి అంటుకునేలా కలుపుకొని విత్తుకోవాలి. చివరి దుక్కిలో ఎకరాకు 2కిలోల ట్రైకోడెర్మావిరిడిని 25 కిలోల పశువుల ఎరువుతో కలుపుకొని పొలంలో చల్లుకొని కలియ దున్నుకోవాలి. దీనివలన తెగుళ్లను నివారించుకోవచ్చు. ఆధునికి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ప్రకృతి సాగు చేపట్టడం వలన వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవచ్చు. దీంతో పంటలో అధిక దిగుబడులు వచ్చేందుకు వీలుందని, రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయాధికారి వివరించారు.



వరద బాధితులకు బాసటగా విద్యార్థులు



నిత్యావసర సరుకులు తరలిస్తున్న సెయింట్‌ఆన్స్ స్కూలు యాజమాన్యం

చీరాల రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని వరద బాధితులకు చీరాల మరియమ్మపేటలోని సెయింట్ ఆన్స్ స్కూలు యాజమాన్యం బాసటగా నిలిచింది. స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం నుంచి సేకరించిన రూ. 3.9 లక్షలతో నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, కొత్త బట్టలు వంటి వస్తువులు కొనుగోలు చేసి సోమవారం లారీలో తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ సిస్టర్ జీనా జేవియర్, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రిసాలు మాట్లాడారు. మానవతా దృక్పథంతో తమ స్కూలు యాజమాన్యం ఆదేశాలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో విరాళాలు సేకరించి వస్తువులు కొనుగోలుచేసి తరలించినట్లు చెప్పారు. సహకరించిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు చెప్పారు. ముందుగా వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పచ్చ జెండాఊపి లారీని విజయవాడ తరలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్, కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రిసా, స్కూలు పీఈటీలు బోయిన ధనుంజయ, విజయ నిర్మల, పరిమళ, సురేష్, ఎన్‌సీసీ ఎన్‌స్ట్రక్టర్ గొర్ల గోపీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వాలీబాల్ ఆడి ఉత్సాహపరుస్తున్న చీరాల డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు



పందిళ్లపల్లిలో పరుగు పందెం పోటీల్లో పోటీ పడుతున్న విద్యార్థులు

యద్దనపూడి: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆశలు పెంచుకోవాలని చీరాల ఉప విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మంచి పోటీతత్వాన్ని అలాగే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, జంపింగ్, పరుగుపందెం వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏఎమ్ శ్రీనివాసరావు, దాత బత్తుల కృష్ణవేణి, క్రీడా స్పాన్సర్ బత్తుల వీరాంజనేయులు, సర్పంచ్ సుధాకర్, విద్యాకమిటీ చైర్మన్ శిలువరాజు, పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్కూల్ గేమ్స్ పునాది.
వేటపాలెం: పాఠశాల స్థాయిలో నిర్వహించే మంచి క్రీడాకారులుగా తయారవుతారని హెచ్ఎం మెడబలి శేఖరరావు పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో వివిధ క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఎంసీ చైర్మన్ చెరుకూరి రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ఎం సీతాదేవి, మండల సమన్వయకర్త కర్ణ నాగేశ్వరావు, సెక్రటరీ బుద్ధి మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్ 14, 17 బాల బాలికల ఆటల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చీరాల డిప్యూటీ డీఈవో ఏ. శ్రీనివాసరావు ఆటల పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, ఖో ఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శివకుమారి

చినగంజాం: ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కడవకుదురు, మోటుపల్లి పంచాయతీల పరిధిలో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. కడవకుదురు పంచాయతీ పరిధిలో నూరు శాతం ఉపాధి హామీ నిధులతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణం ఎస్సీ కమ్యూనిటీ ప్రాంతంలో రూ.20 లక్షలు, ఓసీ కమ్యూనిటీ నివాసిత ప్రాంతంలో రూ.15 లక్షలు మొత్తం రూ. 35 లక్షలతో పనులను ప్రారంభించారు. అడివీధిపాలెం గ్రామంలో రూ.10.50 లక్షలు నూరుశాతం ఉపాధి హామీ నిధులతో అంతర్గత రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జీ శివకుమారి, నక్కల రాఘవరావు, ఏఈ పీఆర్ డీ దాసు, మాజేటి వెంకటరమణ, టీడీపీ అధ్యక్షుడు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్



అబ్దుల్ రషీద్

చీరాల: చీరాల మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్ చీరాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.చక్రవర్తి మాతృశాఖ అయిన అగ్రికల్చర్ శాఖకు బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయురాలికి నేషన్ బిల్డర్ అవార్డు



శారదను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ వికాస్ సభ్యులు

యద్దనపూడి: రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్–2024 సంవత్సరానికి ప్రకటించిన నేషన్ బిల్డర్ అవార్డును సూరవరపుపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు దక్కించుకున్నారు. పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యాబోధనలు అందించటంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఉపాధ్యాయుని ఎమ్‌వీఆర్ఎల్‌పీ శారదకు క్లబ్ సోమవారం గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో నేషన్ బిల్డర్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుల్లెల సుబ్రమణ్యం మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, మంచి ఉత్తమ ఉపాధ్యాయులు తమ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటంలో వారి పాత్ర కీలకమైనదన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన ఉపాధ్యాయురాలుని ఎంఈఓ–2 గోపి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మార్టూరు యువకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీమన్నారాయణ

మార్టూరు: స్థానిక నేతాజీ నగర్ కాలనీకి చెందిన గోగులమూడి శ్రీమన్నారాయణ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఈఎన్. ధనుంజయరావు సోమవారం తన కార్యాలయంలో పట్టాను శ్రీమన్నారాయణకు అందజేశారు. ఆంధ్ర యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థి అయిన శ్రీమన్నారాయణ అదే కళాశాల ప్రొఫెసర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ×వాయు కాలుష్యం భారతీయ చట్టాలు–ప్రభుత్వ విధానాల్లు అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తాను డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు శ్రీమన్నారాయణ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విద్యాసంస్థల విరాళం



సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాన్ని అందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

చీరాల అర్బన్/చీరాల: వరద బాధితులకు మేము సైతం అండగా ఉంటామని గౌతమి విద్యాసంస్థ ముందుకు వచ్చింది. వరద బాధితులకు సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.50 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు అందించారు. సోమవారం విద్యాసంస్థలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా తమ వంతు సహాయంగా విరాళాలు అందించాలనే పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్పందించారన్నారు. సహాయానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలానే అన్న క్యాంటీన్‌కు రూ.10వేలను చెక్కును విద్యాసంస్థల యాజమాన్యం ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్‌కు 15వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దాసరి శారదా రామకృష్ణ రూ.25,011 చెక్‌ను ఎమ్మెల్యేకు అందించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, భాద్రపద మాసం, రోహిణి నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రేపటి నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం రత్నకుమారి, ఉపాధ్యాయులు

చినగంజాం: ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు 2024 ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, మండల అధ్యక్షుడు ఎస్ నరసింహారావు సోమవారం సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25 , మండల స్థాయి అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబరు–27న, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9,10 తేదీల్లో జరుగుతాయని వారు తెలిపారు. పాఠశాలల స్థాయిలో నిర్వహించే పోటీల్లో ఆయా పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులు అని, తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో జరుగుతాయన్నారు. ఒక్కో తరగతి నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి వారిని అక్టోబరు 1న మండల స్థాయి నిర్వహించే పోటీలకు పంపించాలని వారు తెలిపారు. ఈసందర్భంగా జేవీవీ వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు 2024 వాల్‌పోస్టర్‌ను సోమవారం చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారి, ఇతర ఉపాధ్యాయులు కలిసి ఆవిష్కరించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం

అద్దంకి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిత్యం పరిశుభ్రత కోసం పాటుపడే కార్మికులకు వైద్య పరీక్షలు అప్పుడప్పుడూ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వైద్య శిబిరంలో 100 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని వైద్యాధికారి శరత్ కుమార్ పర్యవేక్షించారు. శిబిరంలో డాక్టర్ వై లక్ష్మి, చీరాల డాక్టర్ పీ రాజశేఖర్, వై లక్ష్మి, పీ వెంకట్, కిరణ్, అనితీ జ్యోతి, తదితర వైద్యులు పరీక్షలు చేశారు.

వామపక్ష నాయకుల నిరసన




బొమ్మల సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పర్చూరు (చినగంజాం): కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు పర్చూరులో వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బొమ్మల సెంటర్‌లో సోమవారం ఫ్లెక్సీలు చేత పట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 44 కార్మికుల వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులరు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బండారు చిన్నదాసు, కార్యదర్శి మత్తె డేవిడ్, కే శ్రీనివాసరావు, చిమటా వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి నాట్లు

- పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు
- 'సాక్షి' కథనాలతో విడుదలైన నీరు



కుంకలమర్రు రోడ్డులో నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

కారంచేడు: జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటుంది. గత కొన్ని రోజులుగా అన్నదాతలు సాగునీటి కోసం అల్లాడిపోయారు. ఈ ప్రాంతంలో వరి సాగుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువలో నీరు అడుగంటిపోవడంతో నాట్లు వేయడానికి సిద్ధమవ్వాల్సిన అన్నదాతలు తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. సమయం మించిపోతుంది, కాలువలో నీరు లేదు, వర్షాలు కురవడం లేదనే ఆందోళనలో ఉన్న రైతన్నలకు గత రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బతుకు జీవుడా అన్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. వర్షంతోడు కొమ్మమూరు కాలువకు నీరులేక అన్నదాతలు అవస్థలు పడుతున్న తీరును సైతం సాక్షి రెండు సార్లు కథనాలు ప్రచురించింది. దీంతో దిగివచ్చిన నీటిపారుదల శాఖ అధికారులు కాలువకు పడిన గండ్లను తాత్కాలికంగా పూడ్చి రైతులకు అసరమైన సాగునీటిని కారంచేడు యూటీ వద్ద 6.5 అడుగులు నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కొమ్మమూరు ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేయాల్సిన అన్నదాతలు పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రకృతి కరుణించి తుఫానులతో వర్షాలు కురవడంతో అన్నదాతల మోముల్లో చిరునవ్వులు పూస్తున్నాయి. సాగుకు అవసరమైన నీరు చేలల్లోకి చేరడంతో సాగుకు సన్నద్ధమయ్యారు. మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల పరిధిలో ఖరీఫ్ సాగులో సుమారు 12 వేల ఎకరాల్లో వరిసాగుకు అన్నదాతలు తమ పనులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం మళ్లీ పచ్చని తోరణాలు పరిచినట్లు వరి చేలు కళకళలాడుతున్నాయి. కొంత మంది రైతులు నార్లు పోసుకుంటుంటే మరి కొంత మంది నాట్లు వేస్తున్నారు. కొంత మంది నాట్ల కోసం చేలల్లో దమ్ములు చేసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు పనులు లేక చెట్ల కింద కాలక్షేపం చేసిన అన్నదాతలు పలుగు, పారలు పట్టి చేలకు పయనమవుతున్నారు. చూడ ముచ్చటి పరిసరాలతో కారంచేడు ప్రాంతం ప్రస్తుతం ఆహ్లాదకరంగా మారింది. ఇదే వాతావరణ పరిస్థితి కొనసాగి అన్నదాతల్లో చిరుమోమును ఎంత వరకు చూస్తామోనని కొంత మంది చర్చించుకుంటున్నారు.

పొలం పిలుస్తోందితో రైతులకు విజ్ఞానం

అద్దంకి రూరల్/మేదరమెట్ల: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు విజ్ఞానం లభిస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. బుధవారం కలవకూరు, శింగరకొండ పాలెం గ్రామాలు, గురువారం ఉదయం శంఖవరప్పాడు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

➤ కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్ణయించిన తేదీ మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు ఉంటాయని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమాల్లో రైతులతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఏవో కోరారు.

డిసెంబర్ వరకు కార్యక్రమం..
పర్చూరు (చినగంజాం): పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో డిసెంబర్ వరకు పొలం పిలుస్తుంది కార్యక్రమం జరుగుతుందని పర్చూరు ఏడీఏ ఎస్ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో గ్రామ పంచాయతీ పరిధిలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, వెటర్నరీ, మార్కెటింగ్, సెరీకల్చర్, ఫిషరీస్ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ, సాంకేతిక సమాచారాన్ని పరిజ్ఞానాన్ని కలిగిస్తారని వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి ఆదాయం ఎలా పొందాలో వారు తెలియజేస్తారని ఏడీఏ వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.